మెరకముడిదాంకు అదనపు బస్సు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థుల సౌకర్యార్థం మెరక ముడిదాంకు అదనపు బస్సును నడపనున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. మెరకముడిదాంలో చదువుకుంటున్న కళాశాల విద్యార్థులు, పాఠశాలల విద్యార్థుల ఇబ్బందులపై ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాలను స్పందించి బస్సును వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తిరుగుతున్న 7.30గంటలకు మెరకముడిదాం-చీపురుపల్లి ట్రిప్పుకు అదనంగా చీపురుపల్లి నుండి ఉదయం 6.35గంటలకు బయలుదేరి గర్భాం-భైరిపురం మీదుగా మెరకముడిదాం ఉదయం 7.35గంటలకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి 7.50గంటలకు మెరకముడిదాంలో బయలుదేరి గర్భాం-భైరిపురం-గరివిడి మీదుగా చీపురుపల్లి 8.50గంటలకు చేరుకునే విధంగా ఒక ట్రిప్పును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా వినియోగించుకోవాలని తెలిపారు.

వాలీబాల్ క్రీడలో విజయనగరం జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. సీనియర్, జూనియర్ స్థాయి ఏదైనా, రాష్ట్రంలో ఎక్కడ పోటీలు జరిగినా విజయం విజయనగరం జట్టుదే. విజయనగరంతో పోటీ అంటే.., ప్రత్యర్థి జట్లు హడలిపోతుంటాయి. అంతలా హవా సాగిస్తున్నారు వాలీబాల్ క్రీడాకారులు. అందరిదీ గ్రామీణ నేపథ్యమే. అయినా బరిలో దిగి షాట్ కొడితే మాత్రం బోర్డుపై పాయింట్ కచ్చితంగా చేరుతుంది. అదే విజయయాత్ర కొనసాగిస్తూ.. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ వాలీబాల్ పోటీల్లో అండర్-17 విజేతగా జిల్లా నిలిచింది. రాష్ట్ర జట్టుకు నలుగురు ఎంపికై, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచిన అండర్-17 బాలుర జట్టు

- వాలీబాల్‌లో అదరగొడుతున్న జిల్లా క్రీడాకారులు
- రాష్ట్ర విజేతగా సత్తాచాటిన బాలుర జట్టు
- జాతీయ స్థాయి పోటీలకు నలుగురు ఎంపిక

షాట్ కొడితే.. పాయింట్ రావాల్సిందే

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అండర్-17 స్కూల్ గేమ్స్ విభాగంలో విజయనగరం జిల్లా జట్టు వాలీబాల్ రాష్ట్ర విజేతగా నిలిచింది. జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారులు నలుగురు అర్హత సాధించారు. కడపలో ఈనెల 7 తేది నుంచి 9 తేది వరకు జరిగిన పోటీల్లో బాలుర జట్టు ఫైనల్‌లో పశ్చిమగోదావరి జట్టుపై గెలిచి జిల్లా పతాకాన్ని ఎగుర వేసింది. బాలికల విభాగంలో జిల్లా జట్టు క్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లింది. జిల్లా జట్టును రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపిన క్రీడాకారుల్లో బాలుర విభాగంలో బోగి రంజిత్ కుమార్, బి. అభిషేక్‌లు జాతీయ పోలకు రాష్ట్రజట్టులో ప్రాతినిధ్యం వహించనున్నారు. బాలికల విభాగంలో జి.ప్రవల్లిక, ఎం.విజయలక్ష్మి రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు. బాలుర విభాగంలో జాతీయ పోటీలు ఈనెల 29 నుంచి నవంబర్ 4తేది వరకు జమ్ముకాశ్మీర్‌లోను, బాలికల విభాగంలో పోటీలు నవంబర్‌లో తమిళినాడులోను జరగనున్నాయి. ఈనేపథ్యంలో జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు అభిప్రాయాలను ప్రజాశక్తికి వివరించారు.

జాతీయ పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉంది

మారుమూల గ్రామాంలో పుట్టిన నేను జమ్మూకాశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉంది.పారాది హైస్కూల్‌లో చదువుతున్న నాకు రాష్ట్ర పోటీల్లో పాల్గొనిజిల్లాను విజేతగా నిలపవడంలో నాకు మంచి అవకాశం వచ్చింది. జాతీయ పోటిల్లో రాష్ట్ర జట్టును విజయపథంలో నడిపిస్తాను. నాలో ప్రతిభను గుర్తించి బోగాపురం హైస్కూల్ మైదానంలో నాకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన వాలీబాల్ కోచ్ చిన్నారి మాష్టారు కృషే ఇందుకు కారణం.

– బి.రంజిత్‌కుమార్, పారాది

జాతీయ పోటీల్లో సత్తాచాటుతా

రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం, జాతీయ పోటిల్లో అవకాశం లభించడం ఆనందంగా ఉంది. జాతీయ పోటీల్లో బాగా ఆడి సత్తా చాటుతాం. నాలో ఉన్న ప్రతిభను గుర్తించి మా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనేలా చేవారు. రాష్ట్ర విజేతగా నిలిచిన స్ఫూర్తితో జాతీయ పోటీల్లో రాణించి రాష్ట్రానికి పేరు తెస్తాను.

భౌరౌతు అభిషేక్, బలిజిపేట

అవకాశాన్ని వినియోగించుకుంటా

జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను. నన్ను ప్రోత్సహించి ఈ రోజు జాతీయ పోటిల్లో పాల్గొనే అవకాశం వచ్చిందంటే ఉపాధ్యాయులు అందించిన కృషే కారణం. తమిళనాడులో వచ్చే నెలలో జరిగే పోటీల్లో బాగా ఆడి మరింత గుర్తింపు తెచ్చుకుంటాను.

– జి.ప్రవల్లిక, బొబ్బిలి

ఆనందంగా ఉంది

వాలీబాల్ జాతీయ పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎలా ఆడాలనేది వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. జాతీయ పోటీల్లో రాణించి జిల్లా ప్రతిష్టను చాటి చెబుతాం. తమను ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయుల ఆశలను నెరవేరుస్తాం.

ఎం. విజయలక్ష్మి , గుర్ల మండలం, జమ్ముపేట

సేవా కార్యక్రమాలకు

కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలి

- వైకల్యం మానవ తప్పిదమే : కేంద్ర సహాయ మంత్రి నారాయణ స్వామి
- వికలాంగులకు రూ.3.25 కోట్ల విలువైన పరికరాలు పంపిణీ

ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి నారాయణస్వామి, జెడ్‌పి చైర్మన్, ఎమ్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

వికలాంగులకు న వా క రి ం చే ం దు కు పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలు సిఎస్ఆర్ నిధులను కేటాయించాలని కేంద్ర సామాజిక న్యాయ, సాధికార శాఖా సహాయ మంత్రి ఎ. నారాయణ స్వామి కోరారు. శనివారం రాజీవ్ క్రీడా ప్రాంగణంలో అలింకో సంస్థ ద్వారా వికలాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైకల్యం అనేది మానవ తప్పిదమేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. వైద్యుల తప్పిదం కూడా లేకపోలేదని, చిన్నప్పుడే ఇంటివద్దనే అంగవైకల్యాన్ని గుర్తించి వైద్యులు తగు వైద్యాన్ని అందించడం బాధ్యంగా భావించాలని అన్నారు. వైకల్యం ఏ రూపం లో ఉన్నా వెంటనే నిరోధించడానికి ప్రయత్నం చేయాలని అన్నారు. విద్యావంతులు సమాజ సేవకు ముందుకు రావాలని తెలిపారు. అలింకో సంస్థ ద్వారా పంపిణీ చేస్తున్న ఉపకరణాలు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగి ఉన్నాయని తెలిపారు. ప్రజాప్రతినిధులకు సేవ చేయాలనే తపన ఉంటే సాధ్యం కానిది లేదని, నేడు ఈ కాంప్ లో ఉపకరణాలు పంపిణీ చేయడానికి పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్ర శేఖర్ కృషి చేయడం వల్లనే 3.25 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు. రాష్ట్రం నుండి ప్రజలకు అవసరమైన ఎలాంటి ప్రతిపాదనలు అందినా సహాయం చేయడానికి ప్రధాని మోడీ సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ అంగవైకల్యం అంటే బాధలు అనే భావం ఒకప్పుడు ఉండేదని, నేడు ప్రజా ప్రభుత్వం భరోసానిస్తూ మేం ఉన్నామనే నమ్మకాన్ని కలిగిస్తుందన్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తో అంగవైకల్యం కలిగిన వారికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నామని అన్నారు. ఎమ్‌పి బెల్లాన చంద్ర శేఖర్ మాట్లాడుతూ పేదలకు అంగవైకల్యాన్ని అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరగానే మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. బ్యాటరీ వాహనాలకు బాటరీ 4 గంటలు ఛార్జ్‌చేస్తే 40 కిలో మీటర్ల దూరం నడుస్తుందని, మరమ్మతులు వచ్చినా ఆలింకో వారే చేస్తారని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ 16 రకాల పరికరాలను 2338 మంది లబ్ధిదారులకు 3711 ఉపకరణాల ను ఒకేసారి అందించడం గొప్ప విషయమని అన్నారు. ఎమ్‌పి తన నిధుల నుంచి రూ. 70 లక్షలు కేటాయించారని తెలిపారు. ఇంకనూ మిగిలిపోయిన వికలాంగులకు కూడా అవసరమైన ఉపకరణాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాటరీతో నడిపే ట్రై సైకిల్స్ , వ్యాకింగ్ స్టిక్స్, బ్రెయిలీ కిస్, ట్రై సైకిల్స్ తదితర ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యేలు కంబాల జోగులు, కడుబండి శ్రీనివాస రావు, నగర మేయర్ వి.విజయలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆలింకో ఎమ్‌డి సంజయ్ మండల్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, డిఆర్‌డిఎ మెప్మా పీడీలు కల్యాణ చక్రవర్తి, సుధాకర్, వికలాంగుల శాఖ ఎడి జగదీష్, జిల్లా అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సానుభూతి కోసమే

టిడిపి డ్రామాలు

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల్లో సాను భూతి పొందాలనే చంద్రబాబు ఆరోగ్యంపై టిడిపి నాయకులు డ్రామాలు ఆడుతున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఆరోగ్యంపై టిడిపి నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. జైలుశాఖ డిఐజి చంద్రబాబు నాయుడు రిమాండ్ మొదటి రోజు నుంచి నేటి వరకు హెల్త్ బుల్లెట్ విడుదల చేశారని.. కానీ టిడిపి శ్రేణులు ప్రజలను తప్పుతోవ పట్టించి సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు ఒక్కరి ఆరోగ్యమే కాకుండా రాష్ట్రంలో ప్రజలందరి ఆరోగ్యంపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రతి గడపకు వైద్యులను పంపించి జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు అరెస్టు పూర్తిగా చట్టపరంగా జరిగిందని అన్నారు. సమావేశంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొన్నారు.

చట్టాలు చుట్టాలుగా..

యథేచ్ఛగా అధికార దుర్వినియోగం : టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట

వైసిపి పాలకులు చట్టాలను చుట్టాలుగా మార్చేశారని టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. శనివారం చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేసిన ఫ్లెక్సీలను పార్టీ కార్యాలయంలో ప్రదర్శించారు. వాటిని అశోక్ గజపతిరాజు తిలకించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ స్వచ్ఛందంగా సంతకాలు చేసి మద్దతు తెలిపిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు జైలులో అనారోగ్యంతో బాధపడుతున్నా ఆస్పత్రికి తరలించకపోవడం అన్యాయమని అన్నారు. చంద్రబాబు నేరం చేశారా అని వెతకడానికి నెల రోజులు చాల లేదని అన్నారు. దేశంలోను, రాష్ట్రంలోను రాజ్యాంగం అసలు అమలవుతుందా? చట్టాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. అనారోగ్యానికి గురయ్యారని చెబితే బరువుపై కామెంట్ చేస్తున్నారని అన్నారు. 16 నెలలు జైల్లో ఉండి బెయిల్‌పై వచ్చిన వారు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, విజయనగరం మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి వర్మ రాజు, విజ్జపు ప్రసాద్, కనకల మురళీమోహన్, కంది మురళి నాయుడు, కర్రోతు వెంకట నర్సింగరావు పాల్గొన్నారు.

సంతకాలు చేసిన ఫ్లెక్సీలను పరిశీలిస్తున్న అశోక్, టిడిపి నాయకులు

ఉపాధి కల్పించిన బాబుపై అక్రమ కేసులు

విద్యార్థులకు, యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసిన చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి జైలుపాటు చేయడం అన్యాయమని తెలుగు యువత విజయనగరం పార్లమెంట్ స్థానం అధ్యక్షులు వేమలి చైతన్యబాబు అన్నారు. చంద్రబాబుకు ఇంకా ఇబ్బంది పెడితే జైలు గోడలు బద్దలవు తాయని అన్నారు. శనివారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడారు. భవిష్యత్ గ్యారెంటీతో ప్రజల్లోకి వెళ్లి ప్రజలకు చంద్రబాబు నాయుడు మరింత దగ్గర అవుతున్నా రన్న అక్కసుతో, రాజకీయ కక్షతో అరెస్ట్ చేశారని అన్నారు. ఇన్ని రోజులు అయినా ఇప్పటికీ కోర్టుకు సరైనా ఆధారాలు సమర్పించలేదంటే అక్రమ కేసేనని అన్నారు. రాష్ట్ర ప్రజలంతా చంద్రబాబుకు మద్దతుగా ఉన్నారని అన్నారు. పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గొలగాన సురేంద్ర మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బరువు 5 కేజీలు తగ్గితే, ఆయన గురించి సజ్జల రామకృష్ణారెడ్డి కేజీ బరువు పెరిగారని ఎద్దేవా చేయడం దారుణమని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక మద్దిల ప్రవీణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొగిరి పైడిరాజు, పెదిరెడ్ల సత్యన్నారాయణ, పాలూరి రాజినాయుడు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకుంటుంది

కేంద్ర మంత్రి నారాయణస్వామి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకుంటుందని కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ సహాయ మంత్రి ఎ. నారాయణ స్వామి అన్నారు. శనివారం జిల్లా పర్యటనలో భాగంగా బిజెపి జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయనకు నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ దేశం పురోగతి సాధిస్తుందని, ఉజ్వల భవిష్యత్ దిశగా దేశ నిర్మాణం జరుగుతుందని అన్నారు, కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తతంగా తీసుకుని వెళ్లాలని దిశా నిర్దేశం చేసారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు పివిఎన్ మాధవ్ , రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు, కుసుమంచి సుబ్బారావు, కార్యదర్శులు, శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై

రెవెన్యూ దూకుడు

ఖాళీ స్థలాల్లో బోర్డులు పెట్టిన అధికారులు

ప్రజాశక్తి-బొబ్బిలి

నకిలీ ఇళ్ల పట్టాలపై రెవెన్యూ అధికారులు దూకుడు పెంచారు. మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలను కొంతమంది అక్రమార్కులు ఆక్రమించేసి నకిలీ పట్టాలు తయారు చేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ ఇళ్ల పట్టాలపై 'ప్రజాశక్తి'లో కథనాలు రావడంతో ఆర్‌డిఒ పి.శేషశైలజ స్పందించి సమగ్ర దర్యాప్తు చేయాలని తహశీల్దార్ డోల రాజేశ్వరరావును ఆదేశించారు. దీంతో విఆర్‌ఒలతో నాలుగు బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో ఆక్రమణ చేస్తే చర్యలు తీసుకుంటామని బోర్డులను ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయడంతో ఇకపై ఆక్రమణలను అడ్డుకోవచ్చని తహశీల్దార్ రాజేశ్వరరావు చెప్పారు. దర్యాప్తులో నకిలీ పట్టాల గుట్టు బయట పడటంతో అక్రమార్కుల్లో గుబులు మొదలైంది. నకిలీ పట్టాలను గుర్తించేందుకు, ప్రభుత్వ ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా వివరాలు ఇచ్చి సహకరించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరినట్లు తహశీల్దార్ చెప్పారు. నూతనంగా నిర్మించే ఇళ్ల పత్రాలు తమకు పంపించి ఒరిజినల్ పట్టా, కాదో నిర్ధారణ చేసుకున్న తర్వాత మాత్రమే నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాజేశ్వరరావు చెప్పారు.

ఖాళీ స్థలాల్లో బోర్డులు ఏర్పాటుచేస్తున్న అధికారులు

సాయం పిసరంత... ప్రచారం కొండంత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏడాదిగా ఇదిగో అదిగో అంటూ చెప్పుకొచ్చిన ప్రభుత్వం ఎట్టకేలకు ఈనెల 12న సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే సాయంపై అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఒకరినొకరు మించిపోయేలా ప్రసంగించారు. ప్రభుత్వ సాయాన్ని ఆకాశానికెత్తేశారు. ఆ మాటకొస్తే బొబ్బిలిలో గృహప్రవేశాల సందర్భంగా కొందరు లబ్ధిదారులు కూడా తమ సొంతింటి కల నెరవేరిందంటూ స్పందించారు. ఈ ప్రచారానికి మించి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న మొత్తం ఎంత? ఇసుక, సిమెంట్, ఇటుక, కూలి రేట్లు, మొత్తంగా చిన్నపాటి ఇల్లు కట్టుకోవడానికి అవుతున్న మొత్తం ఎంత? అన్నదానిపై జిల్లాలో ముమ్మరంగా చర్చసాగుతోంది. ఇల్లు కట్టి చూడు అంటారు పెద్దలు. అందుకు తగ్గట్టే గృహ నిర్మాణ సామగ్రి ధరలు ఆశాకాన్ని అంటాయి. ఇనుము టన్ను ధర రూ.60వేలు పలుకుతోంది. ఇక ఇసుక రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులకు తప్ప దొరికే పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ట్రాక్టర్ ఇసుకకు రూ.6వేలు నుంచి రూ.7వేలు వరకు వెచ్చించాల్సివస్తోంది. కూలీల రేట్లు రూ.600 నుంచి రూ.1000 వరకు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో సర్కారువారు ఇస్తున్న రూ.1,80,000 ఏమేరకు సరిపోతుందో అంటూ లబ్ధిదారుల్లో ఎక్కువ మంది వాదన. అందువల్లే ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మంజూరైన 78,127 ఇళ్లకుగాను 3,994 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. పునాదుల తవ్వకాలు, నిర్మాణదశలో 18,819 ఇళ్లు ఉన్నాయి. 13,509 ఇళ్ల మాత్రమే పునాదుల దశలో నిలిచిపోయాయి. కేవలం 36,506 ఇళ్లు పూర్తయ్యాయినట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఇంటి పైకప్పువేసే దశలో 3,811 ఇళు ,, ఇంటిపైకప్పు వేసినవి 1,488 ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్నట్టుగా వారికి అందుతున్న సాయం సరిపోతే ఇన్ని ఇళ్ల నిర్మాణాలు ఎందుకు వెనుకబడ్డాయన్నది ప్రజాప్రతినిధులు, అధికారులే చెప్పాల్సివుంది. ఇంకా చెప్పాలంటే గ్రామీణ ప్రాంతాల్లోనూ, ముఖ్యంగా సొంత స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లే ఎక్కువ ఉన్నాయి. తమ ఇళ్ల నిర్మాణాల వెనుక ఆస్తుల విక్రయాలు, అప్పులు ఉన్నాయన్న విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం, నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోవడం వంటి పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్‌గా ప్రభుత్వం భావిస్తున్న గుంకలాం లేఅవుట్‌లో



నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఈ లేఅవుట్‌లో సుమారు 11వేల ఇళ్ల స్థలాలకు గాను 10,154 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకోవడం, ప్రభుత్వం తరపున ఇసుక, సిమెంట్, ఐరెన్ వంటి నిర్మాణ సామగ్రిని పంపిణీ చేయడం, పూర్తిగా ప్రభుత్వమే నిర్మించి లబ్ధిదారులకు అప్పగించి ఇవ్వడం వంటి మూడు పద్ధతుల్లో ఇక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ఇప్పటి వరకు ఈ లేఅవుట్‌లో కేవలం 352 ఇళ్లు మాత్రమే పూర్తికావడం గమనార్హం. 114 ఇళ్ల నిర్మాణ పనులు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడ మంజూరైన మొత్తం ఇళ్లలో సుమారు 8వేల వరకు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాల్సివుంది. సుమారు 3వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. మిగిలిన ఐదు వేల ఇళ్లు కూడా స్థలాల్లో పునాదులు మాత్రమే పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు పడకపోవడంతో సుమారు ఏడాది క్రితమే సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. తాజాగా నిధుల సమస్య లేదని అధికారులు చెబుతున్నారు. పనులు కూడా ప్రారంభమైనప్పటికీ అంత చురుకుగా సాగడం లేదు. గతంలో ఇక్కడ ఇళ్ల నిర్మాణ పనులకు కాంట్రాక్టర్ వద్ద రోజూ సుమారు 500 నుంచి 600మంది పనిచేసేవారు. ప్రస్తుతం 100మందికి మించి కనిపించడం లేదు. దీంతో, పనులు అత్యంత మందకొడిగా సాగుతున్నాయి. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగిపోతున్నాయని, లబ్ధిదారులంతా సుభిక్షంగా ఉన్నారని చెప్పుకోవడం పట్ల జనం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్తు ఛార్జీల పెంపుతో సామాన్యులపై భారాలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, ప్రజాసంఘాలు ఆగ్రహం

బొబ్బిలి.. రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్తు ఛార్జీల పెంపుతో సామాన్యులపై భారాలు పడుతున్నాయని వామపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం బృందావనం ఫంక్షన్ హాల్లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎం.గోపాలం, ముస్లిం మైనారిటీ సంఘం నాయకులు జాఫర్ మాట్లాడుతూ విద్యుత్తు ఛార్జీలు పెంపుతో సామాన్యులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. గతంలో వినియోగించిన విద్యుత్తుకు అనేక రూపాలలో ఇప్పుడు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. దీనిపై సోమవారం ఎన్‌టిఆర్ బొమ్మ జంక్షన్ వద్ద నిరసన చేపట్టేందుకు రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, పట్టణ కళాసీ సంఘం అధ్యక్షులు బి.అప్పలస్వామి, ప్రజా సంఘాల నాయకులు చంద్ర, ఎన్నాబాబు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. శనివారం విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ స్థానిక మొయిద జంక్షన్‌లో వామపక్షాలు ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ ఛార్జీలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ, న్యూ డెమోక్రసీ నేతలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుర్మార్గంగా విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్య ప్రజానీకంపై పెను భారం వేశారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలాగ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంకొకలా మాట్లాడి విద్యుత్ సంస్కరణల పేరిట ఛార్జీలు పెంచడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి వత్తాసు పలికి 7సార్లు అదనపు ఛార్జీల పేరిట విద్యుత్ ఛార్జీలు పెంచి స్వామి భక్తిని చాటుకున్నారని విమర్శించారు. ఇప్పటికే బిజెపి ప్రభుత్వం విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ ఛార్జీలు పెరిగి ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కాగా విద్యుత్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వం అప్రకటిత కోతలు విధించి సామాన్య ప్రజలను, రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలపై ఇదేమిటని అడిగితే కేసులు పెట్టడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వామ పక్ష నేతలు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పల సూరి పాల్గొన్నారు.

నెల్లిమర్ల.. నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కృత్రియ అవయవాల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి

గురుదేవ్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

కేంద్రమంత్రి నారాయణస్వామి

ప్రజాశక్తి-కొత్తవలస

గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వికలాంగులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని కేంద్రమంత్రి నారాయణస్వామి కితాబిచ్చారు. మండలంలోని మంగళపాలెంలో గురుదేవ్ ట్రస్టు 25వ వార్షికోత్సవం సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపకరాలను వికలాంగులకు కేంద్రమంత్రి స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజుతో కలిసి పంపిణీ చేశారు. గురుదేవ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సెరెబ్రేల్ పాలసీ బ్లాక్‌ను అయన ప్రారంభించారు. అంధులకు పింఛన్లు, వృద్ధులకు రేషన్, భజన సంఘం సభ్యులకు దుస్తులు, కోలాటం స్టిక్స్, చిడతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్సీ పి.మాధవ్, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్. అచ్చుతరామయ్య , డాక్టర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సజ్జలకు ఉన్న అధికారం ఏమిటి?

ప్రజాశక్తి-వేపాడ

గొంప కృష్ణ

సజ్జల రామకృష్ణారెడ్డి ఏ హోదాలో ప్రెస్‌మీట్ పెట్టి చంద్రబాబు నాయుడుపై అవాస్తవాలు ప్రకటిస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ప్రశ్నించారు. వేపాడలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సజ్జల.. ఎమ్‌పి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కనీసం వార్డు మెంబరు కూడా కాదని, ముఖ్యమంత్రికి సలహాదారుడు మాత్రమేనని చెప్పారు. ఇష్టం వచ్చినట్లు పేలాపన చేసే అధికారం సజ్జలకు లేదన్నారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేశారని, ఎన్నికల ముందు కావాలనే ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. టిడిపి హయాంలో ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు అప్పటి సిఎం చంద్రబాబు ఆటంకాలు కల్పిస్తే ప్రజసంకల్పయాత్ర పూర్తయ్యేదా? అని ప్రశ్నించారు. రోజులన్నీ ఒకేలా ఉండవని, ఇప్పటికే వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, సరైన సమయంలో గుణపాఠం చెప్పేందుకు జనం సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

చైర్మన్ దృష్టికి మత్స్యకారుల సమస్యలు

ప్రజాశక్తి - భోగాపురం

మంత్రి, చైర్మన్‌తో మైలపల్లి నర్సింహులు

మత్స్యకారులు ఎదర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మత్స్యకార కార్పోరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆ కార్పోరేషన్ డైరెక్టర్ మైలపల్లి నర్సింహులు తెలిపారు. ఆయనను శనివారం సాయంత్రం విశాఖలో కలిసి సమస్యలన్నీ వివరించినట్లు చెప్పారు. గతంలో ఉన్న విధంగా మత్స్యకారులకు రుణాలు, బోట్లు, వలలు ఇచ్చేందుకు సిఎం హామీ ఇచ్చినట్లు చైర్మన్ తనతో చెప్పారన్నారు. ఇలాంటి వాటి వల్ల మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుందని అన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎస్.కోట క్రీడాకారిణి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అండర్-19 స్కూల్ గేమ్స్ కబడ్డీ సెలక్షన్స్ శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బుత్తల నీలిమ సత్తాచాటింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో నీలిమను ప్రిన్సిపల్ ఎం.వి.కృష్ణమూర్తి, కోచ్ తాతబాబు, సిబ్బంది అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా నీలిమ రాణించాలని ఆకాంక్షించారు.

సర్వరోగ నివారిణి.. పత్ర కషాయం

ప్రజాశక్తి-కొత్తవలస

పత్ర కషాయంతో పంటలో తెగుళ్లలన్నీ నివారించవచ్చని రీజనల్ థిమటిక్ లీడ్ కె.ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని దెందేరు, గలిశెట్టిపాలెం గ్రామాల్లో పంటపొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు., తెగుళ్ల, పురుగులు ఆధారంగా వాటి నివారణకు ఉపయోగపడే కషాయాలను తయారు చేసి రైతులకు పంపిణీ చేశారు. ఈ క్రమంలో పలు పత్ర కషాయం సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందని తెలిపారు. పంటలకు అవసరమైన పోషకాలు అందించడంలోనూ, పంట దిగుబడిలోనూ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో సిఎ శ్రావ్య, ఎపిఎం వెంకటరమణ, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

17న బైక్ వేలం

ప్రజాశక్తి-వేపాడ

ఈ నెల 17న శృంగవరపుకోట కోర్టు వద్ద బైక్‌ను వేలం వేయనున్నట్లు ఎస్ఐ కె.రాజేష్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

మల్లంపేట రోడ్లు, కాలువలు పూర్తి

ఎమ్మెల్యే, చైర్మన్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని మల్లంపేటలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తొమ్మిది చిన్న చిన్న రోడ్లు, మూడు కాలువలు నిర్మాణం పూర్తయింది. దీంతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ, కమిషనర్ శ్రీనివాసరావుకు ఆ గ్రామస్తులు, కొప్పల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోల జగన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలు ఇదే విధంగా పరిష్కరించి వారంతా మన్ననలు పొందాలని తెలిపారు. తమ గ్రామంలో తాగునీరు, శ్మశాన వాటిక సమస్యలు కూడా పరిష్కరించాలని ఆ గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

అవినీతిని ప్రశ్నిస్తే వ్యక్తిగత దాడి అన్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, సిఎం జగన్మోహన్ రెడ్డి అవినీతిని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రశ్నిస్తే వ్యక్తిగత దాడి చేయడం అన్యాయమని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. జనసేన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ వ్యక్తిగత విషయాలను సిఎం జగన్ ప్రస్తావించడం సరికాదన్నారు. తండ్రి పదవిని అడ్డం పెట్టుకుని జగన్ రూ.లక్షల కోట్లు అవినీతి చేశారని ఆరోపించారు. అవినీతి కేసుల్లో 18 నెలలు జైల్లో ఉన్న సిఎం జగన్మోహన్ రెడ్డికి పవన్ కళ్యాణ్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

కలిశెట్టి ఆధ్వర్యాన

మిలియన్ సంతకాల సేకరణ

ప్రజాశక్తి-విజయనగరం

అశోక్‌తో మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు

ఆంధ్రుల కలల అమరావతి రాజధానిని కొనసాగించాలని.. ఒక విజన్‌తో రాష్ట్ర ప్రతిష్ఠను పెంచిన చంద్రబాబునాయుడును ఆపద నుంచి తప్పించాలని రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌ను, ప్రధాని మోడీని అభ్యర్థిస్తూ టిడిపి ఎచ్చెర్ల నియోజకవర్గం సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు ఉత్తరాంధ్రలో మిలియన్(10లక్షలు) సంతకాల సేకరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. శనివారం జిల్లా టిడిపి కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజుతో తొలి సంతకం చేయించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ.. రాజధాని అమరావతిని, చంద్రబాబు నాయుడులను ఆపద నుంచి తప్పించేందుకు మిలియన్ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. నెలరోజుల వ్యవధిలో ఉత్తరాంధ్రలోని 36 నియోజకవర్గాల్లో గల బస్టాండ్లు,పబ్లిక్ ప్రదేశాలు, జనంతో రద్దీగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి ప్రజల నుంచి సంతకాలు సేకరించనున్నట్లు చెప్పారు.

డెంకాడ : మండలంలోని గుణుపూరుపేట గ్రామంలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా శనివారం టిడిపి నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, నాయకులు పాణిరాజు, నారాయణరావు, అప్పలనాయుడు, మోహన్, రామారావు, రమణ, అప్పలరాజు, రవి, సతీష్, ప్రసాద్, మధు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: వైసిపి ప్రభుత్వం అవినీతికి అంతులేకుండా పోయిందని టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ మండలంలోని నందిగాం పంచాయతీలో శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన వ్యక్తిని అన్యాయంగా అరెస్టు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి సూర్యతేజ మాస్టర్, పార్టీ నాయకులు ఉత్తాడ అప్పలసూరి, శ్రీనివాస్, నంద ముకుంద తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు'లో సమస్యల గుర్తింపు

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - జామి

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

అందిన సంక్షేమ పథకాలపై ఆరా.. గ్రామాల్లో సమస్యల గుర్తించి, తదుపరి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడంతో పాటు వాటిని పరిష్కరించడం వంటి నాలుగు అంశాలు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలోని కీలకమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని విజినిగిరి సచివాలయ పరిధిలో తానవరం గ్రామంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు 278వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ దానికి అనుసంధానంగా వాలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చాయన్నారు. ఏ గడపను తొక్కినా ముఖ్యమంత్రి పట్ల వారి కృతజ్ఞతాభావం కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఈ ప్రభుత్వం పదికాలాలపాటు సుపరిపాలనతో సాగడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొర్లె సరయు, వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి శీరెడ్డి చంద్రునాయుడు, మాజీ వైస్ ఎంపిపి సిరికి నారాయణరావు, విజినిగిరి సర్పంచ్ కీలారి సూర్యారావు, ఎంపిటిసి సిరికి నాగేశ్వరరావు, గొర్లె అప్పలనాయుడు, జాగరం ఎంపిటిసి నరసింహనాయుడు, , జెసిఎస్ కన్వీనర్ అల్లు వెంకటరావు, ఎర్ర సత్యం, కసిరెడ్డి నారాయణరావు, బి.అప్పలరాజు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విసి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కిషోర్ మహంతి పిలుపునిచ్చారు. జాతీయ చదరంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో చెస్, వాలీబాల్, క్రికెట్, బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించారు. వీటికి జెఎన్‌టియు విజయనగరం, అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో హెచ్‌టి లైన్

నిరంతర విద్యుత్ సరఫరాకు రూ.35 లక్షలతో నిర్మించిన నూతన హెచ్‌టి లైన్‌ను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కిషోర్ మహంతి ప్రారంభించారు. ప్రస్తుతం సెంచూరియన్ విశ్వవిద్యాలయానికి ఒక హెచ్‌టి లైన్ ఉండగా, అదనంగా మరో లైన్ నిర్మించారు. దీనివల్ల ఎలాంటి విద్యుత్ అంతరాయం ఉండదని తెలిపారు.

నాక్ ర్యాంకింగ్‌కు పరిశోధనా పత్రాలు కీలకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు కొనసాగిన పరిశోధన, పరిశోధనా పత్రాల తయారీ అనే అంశంపై కార్యశాల శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు వివిధ అంశాలపై ప్రసంగించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి మాట్లాడుతూ దేశంలో ఉత్తమ నైపుణ్య విద్యలో సెంచూరియన్ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. నాక్ ర్యాంకింగ్‌కు పరిశోధనా పత్రాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి అధ్యాపకుడు తప్పనిసరిగా పరిశోధనా పత్రాలను ప్రచురించాలని కోరారు. అనంతరం నోవల్ పేటెంట్ సర్వీసెస్‌కు చెందిన ఎస్వీఎన్ రాజు పేటెంట్ హక్కులు పొందడం ఎలా అనే అంశాన్ని గురించి వివరించారు. డాక్టర్ శుభశ్రీ నాగ్ మాట్లాడుతూ పరిశోధన పత్రాల తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాల గురించి తెలిపారు. డాక్టర్ వినీత సరాహ మాట్లాడుతూ స్కాపస్‌లో పరిశోధనా పత్రాలు ప్రచురించే విధానాన్ని పేర్కొన్నారు. సందేహాలను నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, కోఆర్డినేటర్ డాక్టర్ విజయ్ బాబు, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్లు ప్రొఫెసర్ మురళీ, ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ సన్నీడియోల్, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ సురేష్‌బాబును సన్మానిస్తున్న వైసిపి డల్లాస్ నాయకులు

పేదలందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. అమెరికా డల్లాస్ నగరంలోని ఫ్రిస్కోలో గల శుభం ఈవెంట్ సెంటర్‌లో శనివారం వైసిపి యుఎస్ఎ కమిటీ, డల్లాస్ వైసిపి సంయుక్తంగా నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అమెరికాలో తెలుగు వారు వైసిపి కార్యక్రమాల గురించి, పార్టీ కోసం చేయాల్సిన కృషిపై ఎమ్మెల్సీ వివరించారు.

నేడు తెలగ సంఘ సమావేశం

ప్రజాశక్తి - భోగాపురం

తెలగా కులస్తులను బీసీల జాబితాలోకి చేర్చాలని తెలగ కులస్తుల సంఘం జిల్లా నాయకులు పల్లంట్ల వెంకట రామారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా తెలగ కులస్తులంతా ఏకమై శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి విశాఖ జిల్లా పాయకరావుపేట వరకు పాదయాత్ర చేయాలని నిర్ణయించామన్నారు. నవంబరు చివరి వారం నుంచి పాదయాత్ర మొదలు పెట్టాల నిర్ణయించుకున్నామన్నారు. దీనిలో భాగంగా భోగాపురం గ్రామంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఉత్తరాంధ్రలో తెలగా కులస్తులు అన్నిరంగాల్లోను వెనుకబడి ఉన్నామనే ఉద్దేశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమను బీసీల్లో చేర్చాలనే ఉద్దేశ్యంతోనే ఈ పాదయాత్రకు పూనుకున్నామన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో లవిడాం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని శుక్రవారం రాత్రి యువకుడు దర్మరణం పాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. పెదబంటుపల్లి గ్రామానికి చెందిన రెల్లి రాంబాబు (18) గరివిడి నుండి స్వగ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. లవిడాం గ్రామం సమీపంలోకి వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో యువకుడు పడి ఉండటాన్ని గమనించిన అటుగా వెళుతున్న కొంతమంది పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని ప్రదీప్‌నగర్‌లో ఈనెల 10న ఒక మహిళ మెడలో మంగళ సూత్రం తెంపుకొని పోయిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు 1వ పట్టణ పోలీసుస్టేషన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు. శనివారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రదీప్ నగర్ లోని శారద అపార్టుమెంటులో వాచ్ వుమన్ గా పని చేస్తున్న ఉడిగల గౌరి (45) ఈనెల 10న సాయంత్రం ఇస్త్రీ చేసిన బట్టలను దగ్గరలో ఉన్న ఇంటికి ఇచ్చేందుకు వెళ్తుండగా, గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిలుపై వచ్చి, మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తుల తాడును తెంపుకొని పరారయ్యారు. ఆమె ఫిర్యాదుమేరకు పోలీసులు కేసుదర్యాప్తు చేసి గూడ్సు షెడ్ వద్ద శుక్రవారం ఎస్ఐ వి.అశోక్ కుమార్, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టి, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు భీమిలి మండలం వలదపేట గ్రామానికి చెందిన కోనాడ రాంబాబు, విజయనగరం కమ్మవీధికి చెందిన బేతా లల్లూను అరెస్టు చేశారు. వీరి నుంచి పుస్తెలతాడుతో పాటు 4 కిలోల గంజాయి, ఒక మోటారు సైకిలును స్వాధీనం చేసుకున్నారు.

లెండిలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి- డెంకాడ

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జొన్నాడలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌ను ఆహ్వానించే సంప్రదాయంలో భాగంగా శనివారం కళాశాల ఆవరణలో ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సిస్టం ఇంజనీరింగ్, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ విభాగాలకు చెందిన సీనియర్ విద్యార్థులు విడివిడిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కంప్యూటర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, కంప్యూటర్ సిస్టం ఇంజనీరింగ్ విభాగపు సభలో హైదరాబాద్‌కు చెందిన ఇన్వెనియో సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సిఇఒ తిరుమల రమేష్ నాయుడు మాట్లాడుతూ మంచి అభిరుచితో ఇంజనీరింగ్ విద్యాభ్యాసం పూర్తి చేస్తే మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునన్నారు. కంప్యూటర్ విభాగపు పూర్వ విద్యార్థులు వసంత్, నిఖిల్ అతిధులుగా విచ్చేసి వారి అనుభవాలను పంచుకున్నారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో గాయత్రీ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎ.వి.సుభాష్ మాట్లాడుతూ విజయానికి నిరంతరం నేర్చుకోవడం అవసరమన్నారు. పూర్వ విద్యార్థి దినేష్ క్యాంపస్‌లో విద్యార్థిగా అధ్యాపకుల మద్దతు గురించి చెప్పారు. ఎలక్ట్రికల్ విభాగంలో ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యం కోసం కృషి చేయాలన్నారు. పూర్వ విద్యార్థులు విజయనగరం అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రిజ్వాన్ షరీఫ్, స్టీల్ ప్లాంట్ ఇంజినీర్ సాయిరాం పాల్గొని డిపార్ట్మెంట్‌తో వారివారి అనుభవాలను విద్యార్థులకు వివరించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ వేడుకలో ఎన్ఎస్‌టిఎల్ సైంటిస్ట్-ఎఫ్ డాక్టర్ వి. రామకృష్ణ మాట్లాడుతూ సమాజానికి మెకానికల్ ఇంజనీర్ల అందిస్తున్న సేవలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి మాట్లాడుతూ ఇంజనీర్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ హరిబాబు, కె.వి.నరసింహం, ప్లేస్ మెంట్ డీన్ జి.ప్రకాశబాబు, విభాగాధిపతులు డాక్టర్ రామారావు, డాక్టర్ సుబ్బరామయ్య, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ ఎం.రాజంబాబు, డాక్టర్ వి. ప్రసాద్, జి.సతీష్, డాక్టర్ సతీష్‌పూజారి, డాక్టర్ పీడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ పబ్లికేషన్
మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P 9/2022 OS 61/2018

Between: కుమిలి రాముునాయుడు --వాది
And : పైల జయలక్ష్మి మరియు మరొకరు --ప్రతివాది

To,
ప్రతివాది అడ్రసు: JDR No1:
పైల జయలక్ష్మి, తండ్రి లేటు మాదయ్య, హిందూ, వయస్సు 45 సం॥ గృహిణి సా॥ లింగాలవలస గ్రామం, గజపతినగరం మండలం, విజయనగరం జిల్లా .

HG dated: 20-10-2023

పై నెంబరు అమలులో ప్రతివాది,JDR నెంబరు వన్ నోటిసు తీసుకొనకుండా తిరుగు చున్నందున శ్రీ కోర్టు వారు సదరు ప్రతివాదికి ఈ పేపరు ప్రకటన ద్వారా తే 20-10-2023 దిన హాజరు నిమిత్తము ఉదయం గం॥ 10.30ని॥ లకు ఖుద్దున గాని, వకీలుగారు ద్వారా గాని పైన తెలిపిన కోర్టులో హాజరు అయి ఏమైన ఆక్షేపణలు యున్న యెడల తెలియ జేయవలసినదిగా కోరడమైనది. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడమగునని యిందు మూలకముగా JDR No1కి తెలియజేయడమైనది.

// By court order //

శ్రీ ఉప్పలపాటి. రమేష్
వాది తరుపు న్యాయవాది,
గజపతినగరం,
సెల్: 9866454030.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM
E.P.No.16/2023 IN O.S No 3/2019 IN FDIA No 2/2021

Between: **KONDAKA BHASKARA RAO.** --Petitioner/Decree-Holder
And: **KANDI SRINIVASA RAO.** --Respondent/Judgment Debtor

To,
Kandi Srinivasa Rao, S/o. Late Appala Ramulu, Hindu, aged about 47 years, Business, Permanent residing at Mettapalli Village, Cheepurupalli Mandal, Vizianagaram District, Present R/at. Door No.16-8, R.M.S. Colony, Gajularega Area, Vizianagaram

GENERAL NOTICE

Please take Notice that the above named petitioner/Decree Holder filed an application under order XXI Rule 11 of C.P.C. for the execution of the decree ordering sale of the Mortgaged property under Order XXI Rule 64 to 66 of C.P.C. after issuing sale notice to you.

That the above petition is posted for hearing **at 10-30 AM** on **17/10/2023** before the above said Court and if you want to contest the matter you may do so einer in person or by a duly instructed pleader and if you fail to show casue matter will be decided in your absence and expert.

(By order of the Honourable Court)

MAJJI NARASINGA RAO
LANKA RAJU,
Advocates,
VIZANAGARAM, Cell No. 9440425672

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VIZIANAGARAM
S.O.P. 15/2023

Between:
1) Thadi Devi Venkata Sesha Satya Swaroop
2) Danduprolu Rani Jaganmai,
3) Kopanthi Hema,
4) T. Renuka ... Petitioners
And:
Kamada Ratna Kumari ...Respondent

GENERAL PUBLIC NOTICE

The public in general are hereby informed that the above named petitioners filed the above petition to issue a Succession Certificate in favour of the petitioners and respondent. The above matter stands posted to **08-11-2023** at **10:30 A.M.** As declaring the petitioners and respondent are the legal heirs of the deceased Thadi Ravindra Roy and also entitle to receive schedule amounts lying in the Savings Accounts of deceased Thadi Ravindra Roy i.e., State Bank of India, Cantonment Branch, Vizianagaram and Union Bank of India, Ayyannapeta Branch, Vizianagaram.

Therefore the public in general are hereby informed that if anyone having objections in the above matter pleased appear or by a pleader duly instructed and able in answer all material question relating to the above case or who shall be accompanied by some person able to answer all such questions on that day in above case failing which the above petition will be decided in your absence.

SHAIK ANARKALI,
SHAIK. NAUSHAD AHMED,
Advocates, Visakhapatnam,
Cell: 8247759363, 9010810570.